జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని వినతి

హాజీపూర్ : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగారు తెలంగాణ విద్యార్థులకు శాపంగా మారిందని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లు నియమించాలని, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు ఇంకా అందలేదన్నారు. తక్షణమే పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.



జనహితం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 20 ఆగస్టు 2023

శాశ్వత మినరల్ వాటర్ సదుపాయం ఏర్పాటు

నవతెలంగాణ- బోథ్

మండల కేంద్రానికి చెందిన మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ తరుపున మాసం లక్ష్మీ 15వ వర్ధంతి సందర్భంగా బోథ్ బస్టాండ్ లో శాశ్వత మినరల్ వాటర్ శనివారం ఆ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవిలో అమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి బస్టాండ్‌లో శాశ్వత మినరల్ వాటర్ ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మెన్ గట్ల గంగాధర్, ఆర్టీసీ కంట్రోలర్ సాయన్న, వార్డు సభ్యులు షేక్ షాకీర్, పడిగెల భోజన్న, అబ్బు, షాబీర్, భూమన్న పాల్గొన్నారు.



హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిఐటియు ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభల ముగింపులో భాగంగా నూతన జిల్లా కమిటీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హాస్టల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ హాస్టల్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, సింగరేణి కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు అంబాల ఓదెలు అభినందనలు తెలిపారు.

జిల్లా కమిటీ అధ్యక్షుడిగా శ్యామ్‌రావు ఎన్నిక

నూతన జిల్లా అధ్యక్షులుగా అడ శ్యాంరావ్, జిల్లా కార్యదర్శిగా మెస్రం సీతారాం, ఉపాధ్యక్షులుగా వెలిశాల క్రిష్ణమాచారి, బాపురావ్, సదాశివ్, కోటయ్య, అశోక్, బాజీరావ్, దివ్య, జిల్లా సహాయక కార్యదర్శిగా శ్రీకాంత్, శ్యామల, రవి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా మహేష్, ఇందు, భారతి, ఆంజనేయులు, సంతోష్, పద్మ, బాలకిషన్, మాన్కు, రాంబాయి, సుగంధబాయి, భీంరావు, సోంబాయి, మహేశ్వరి, లక్ష్మణ్, జారుబాయి, తారాబాయి, హంసబాయి, ఛాయా, మారుతి, రమేష్, జంగు, సురేష్ ఎన్నికయ్యారు.

విద్యకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి కూతవేటు దూరంలో గల దుబ్బగూడలో ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం లేక రేకుల షేడ్ లో విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారని తెలిపారు. కాలనీ వాసుల ద్వారా విషయం తెలుసుకున్న ఆమె శనివారం పాఠశాలను సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్పందించి నూతన పాఠశాల భవనం నిర్మించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దూరవిద్యలో డిగ్రీ, పీజీ చదివేందుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

చదువును మధ్యలోనే మానేసిన విద్యార్థులకు దూరవిద్యలో డిగ్రీ, పీజీలు చదువుకునేందుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముచ్చ స్వామి శనివారం ఒక ప్రకటన తెలిపారు. 2023-24 సంవత్సరానికి కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూరవిద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, డిగ్రీ, పీజీలలో చదువుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, డిగ్రీ, పీజీ పీజులలో చెల్లింపులలో ఇతరులకు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేస్తే కళాశాలకు ఎలాంటి సంబంధం లేదని, కళాశాలకు వచ్చి తప్పని సరిగా గుర్తింపు పొందిన రశీదు పొందాలని కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత మూడు సంవత్సరాల నుండి దూరవిద్య కేంద్రం రద్దు చేశారని ఆ కళాశాలతో మాకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి అడ్మిషన్లు మేము బాధ్యులము కాదని, ఇతర వివరాలకై కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఓటు హక్కును తప్పక నియోగించుకోవాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరు ఓట్టు హక్కును తప్పక వినియోగించుకోవాలని తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేకరు మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తా నుండి బాలాజీ అనుకోడా వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్, ఏఎస్సై యాదవ్ పాల్గొని ప్రారంభించారు. ప్రలోభాలకు లోను కాకుండా భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు, దేశాన్ని పాలించే నాయకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం మనకు కల్పించిన వరమని, ఈ హక్కును సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయాలలో ఓటు హక్కు ఎంతో విలువైన పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్యా పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుని కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గనిలో జనరల్ మాజ్దూర్‌గా పని చేసి మృతి చెందిన మార్త రమేష్ కార్మిక కుటుంబానికి రూ.7.78 లక్షల చెక్కు, రూ.7.50 ఫిక్సిడ్ డిపాజిట్‌లను మేనేజర్ అల్లావుద్దీన్ అందజేశారు. శనివారం కాసిపేట గనిపై మృతుని భార్య మార్త సంధ్యకు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి క్షణం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, మనం ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుందని, సంస్థ బాగుంటుందని అన్నారు. టీబీజీకేఎస్ నాయకులు రాజన్న మాట్లాడుతూ తమ సంఘం వల్లనే రూ.15 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ నారాయణ మాట్లాడుతూ రమేష్ పనిలో ఎప్పుడు చురుగ్గా ఉండేవాడిని ఆకస్మిక గుండెపోటుతో మరణించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి బైరి శంకర్, బన్న లక్ష్మణ్ దాస్, లింగయ్య, సతీష్, రాజేందర్, అరుణ్, రవి, ఇంజనీర్ బాబు, సంక్షేమాధికారి మీర్జా పాల్గొన్నారు.

గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ హేయం

నవతెలంగాణ-జన్నారం

గిరిజన మహిళ లక్ష్మీబాయిపై ఎల్బీనగర్ పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లాధ్యక్షుడు అజ్మీర నందు నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళ అని చూడకుండా చిత్రహింసలకు గురి చేయడం తగని పని అన్నారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నెరవేరిన కల..తప్పనున్న బాధలు..!

- జిల్లాలో కొత్తగా రెండు మండలాలు ఆవిర్భావం
- భోరజ్, సాత్నాల కేంద్రంగా ఏర్పాటుకు నిర్ణయం
- అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పాలన సౌలభ్యం..పనులు సులభతరం

ఆదిలాబాద్ జిల్లాలో మరో రెండు కొత్త మండలాలు ఆవిర్భవించాయి. ఇది వరకు సొనాల కేంద్రంగా మండలాన్ని ఏర్పాటుచేసిన ప్రభుత్వం తాజాగా జైనథ్ మండలంలోని భోరజ్, సాత్నాల కేంద్రాలుగా మరో రెండు మండలాలను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి శనివారం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్నాండ్లు శివారు గ్రామాల ప్రజలు పడిన బాధలు ఇక నుంచి తప్పనున్నాయి. మండల కేంద్రానికి వెళ్లాలంటే ఎదురైన ప్రయాణ బాధలు దూరం కానున్నాయి. సాత్నాల మండలాన్ని ఏర్పాటుచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న 2018 ఎన్నికల సమయంలో జిల్లా కేంద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఏర్పాటుకు ఆయన భరోసా ఇచ్చారు. తాజాగా సాత్నాలతో పాటు భోరజ్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంతో వివిధ గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, జైనథ్

ఆదిలాబాద్ జిల్లాలో ఇది వరకు 18 మండలాలు ఉండగా ఇటీవల సొనాలను మండలంగా ఏర్పాటుచేసింది. తాజాగా వీటికి జతకు భోరజ్, సాత్నాల కేంద్రాలుగా మరో రెండు మండలాలు ఏర్పాటుకావడంతో జిల్లాలో మండలాల సంఖ్య 21కి చేరుకుంది. ఇదిలా ఉండగా ఇన్నాండ్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే పెద్ద మండలంగా పేరుగాంచిన జైనథ్ మండలం విస్తీర్ణంతో పాటు గ్రామాల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నాయి. ఇది వరకు ఈ మండలంలో ఇది వరకు 52 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో మరో 10 గ్రామాలు అనుబంధంగా కొనసాగుతున్నాయి. తాజాగా వీటిని విభజించడంతో జైనథ్ మండల విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రస్తుతం జైనథ్ మండలం నుంచి 28 గ్రామాలను విభజించి కొత్తగా భోరజ్ మండలం ఏర్పాటు చేయగా.. జైనథ్ మండల నుంచి 7 గ్రామాలు, బేల మండలం నుంచి 7 గ్రామాలు, ఆదిలాబాద్ గ్రామీణ మండలం నుంచి మరో 4 గ్రామాలను విభజించి కొత్తగా సాత్నాల మండలం ఏర్పాటుచేశారు.

తప్పనున్న ప్రయాణ కష్టాలు..!

ఇది వరకు జైనథ్ మండల కేంద్రానికి శివారు గ్రామాల ప్రజలు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. సాత్నాల వైపు ఉన్న గ్రామాల ప్రజలు ఏదేని పని నిమిత్తం జైనథ్‌కు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలు పడేవారు. వర్షాకాలంలో రోడ్ల సౌకర్యం బాగా లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి మళ్లీ జైనథ్‌కు వెళ్లేవారు. ఇలా సుమారు 35కి.మి ప్రయాణం చేస్తే కానీ మండల కేంద్రానికి వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఇక భోరజ్ వైపు ఉన్న శివారు గ్రామాల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. కామాయి, కోర్ట, ఆకోలి తదితర గ్రామాల ప్రజలు కూడా ఇబ్బందులు పడేవారు. తాజాగా భోరజ్ మండలం ఏర్పాటుకావడంతో ఇన్నాండ్లు పడిన బాధలు తప్పనున్నాయి. కొత్త మండలాలు ఏర్పాటుకావడంతో రాజకీయంగానూ పదవులు పెరుగుతాయని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలకు కొత్త మండల కేంద్రాలు సమీపం కావడంతో పాటు పరిపాలన పరంగా సౌలభ్యంగా ఉంటుందని చెబుతున్నారు.



కొత్తగా ఏర్పడిన భోరజ్ మండలం ఇదే

కొత్తగా 28గ్రామాలతో భోరజ్ మండలం ఆవిర్భవించింది. ఈ మండలంలో అన్ని గ్రామాలను జైనథ్ నుంచే కలిపారు. గూడ, రాంపూర్(టి), గిమ్మ(కె), గిమ్మ(బి), హత్తిఘట్, ఆకోలి, సిర్సన్న, భోరజ్, మిర్జాపూర్, పూసాయి, పిప్పర్‌వాడ, మాండగడ, షేకాపూర్, కామాయి, డొల్లార, పెండల్‌వాడ, దాదాపూర్, కరణ్‌వాడి, లేఖర్‌వాడ, బాలాపూర్, సావాపూర్, హషంపూర్, తరోడ బురుజ్, అవాల్‌పూర్, ఫౌజ్‌పూర్, ఆకుర్ల, కోర్ట, కేదార్‌పూర్ గ్రామాలతో భోరజ్ మండలం ఏర్పాటయింది. కొత్తగా సాత్నాల మండలం 18 గ్రామాలతో ఏర్పాటైంది. ఈ మండలంలో పార్డి(బి), పార్డి(కె) కాన్పమేడిగూడ, మాంగుర్ల, జామిని, అడ, ముక్తాపూర్, కుంభజరి, టాక్లీ, రామాయి, జంబుల్‌ధరి, మసాల(కె), భోరేగావ్, తోయగూడ(కార), సైద్‌పూర్, సహెజ్, దౌన, సాంగ్వి గ్రామాలను కలిపారు. త్వరలోనే ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరాత్ర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు


నవతెలంగాణ-కాగజ్‌నగర్

నియోజకవర్గంలోని ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని శనివారం కాగజ్‌నగర్ ఫొటో మరియు వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురె చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. తమ అసోషియేషన్ కార్యాలయానికి స్థలం కావాలని, భవన నిర్మాణానికి తగిన సహాయ సహకారాలు అందించాలని సభ్యులు వైస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ అసోషియేషన్‌కు అవసరమైన స్థలాన్ని సమకూర్చుకుంటే భవన నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ప్రభుత్వపరంగా కూడా ఆర్థిక సహకారం అందే విధంగా చూస్తామని అన్నారు. ఉపాధ్యాయుడు యుఎస్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్, నీలి సతీష్, కోశాధికారి ఆర్ వినయ్, ఉపాధ్యక్షులు వి రాజు, కాగజ్‌నగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమల్ల రాధాకృష్ణ, కుందారపు రాజు, కోశాధికారి జె నారాయణ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సిద్దిక్, నియోజకవర్గంలోని ఫొటో మరియు వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.




మందమర్రి : మందమర్రి ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఫొటో భవన్‌లో నిర్వహించిన వేడుకలకు పట్టణ బిఆర్ఎస్ నాయకులు, యూనియన్ అధ్యక్షులు పసుల వెంకటస్వామి, కోశాధికారి మూల అశోక్‌రెడ్డి తదితరులు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు సింగరేణి మనో వికాస్ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మందమర్రి పట్టణ అధ్యక్షుడు జె రవీందర్, పట్టణ ఇన్చార్జి బత్తుల శ్రీనివాస్, టీబీజీకెఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, బండారి సూరిబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

తాండూర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బెల్లంపల్లి మండల, పట్టణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల వేణు ఆధ్వర్యంలో బెల్లంపల్లి తిలక్ స్టేడియం నుండి కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కాంటా చౌరస్తాలో సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా గౌరవ సలహాదారులు కాంపెల్లి శంకర్‌బాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకునూరి రాజకుమార్, పట్టణ గౌరవ అధ్యక్షులు కుంభాల రాజేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాంపల్లి విజయ్, పట్టణ కోశాధికారి మడుపు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రి :



తాండూర్ :

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

- రూ.10400, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- తొమ్మిది మందిపై కేసు నమోదు

నవతెలంగాణ-కెరమెరి

ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో మండలంలోని హట్టి గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..హట్టి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.10,400 నగదు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేకాట, జూదం, ఆన్‌లైన్ మట్కా, క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినా, దేశీదారు, గుడుంబా, గంజాయి వంటి మత్తుపదార్థాలు అమ్మినా, తయారు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో సందీప్ కుమార్, మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.



మైనార్టీలకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుపేదల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బృహత్ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, కుల,మతాలకు అతీతంగా అందరి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. పట్టణంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో శనివారం మైనారిటీలకు వంద శాతం రాయితీతో అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరిస్తూ... అభివృద్ధికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, అందుకు అనుగుణంగానే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి అండగా నిలబడుతోందని అన్నారు. మైనారిటీల ఆర్థిక స్థితిగతులను మార్చే దిశగా బృహత్తర కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అభ్యున్నతి బాటలో నడుస్తోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల వారికి ఆసరాగా నిలుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఎంపీపీ లు గండ్రత్ రమేష్, తుల శ్రీనివాస్, మార్శెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, డీఎండబ్ల్యూఓ కృష్ణవేణి, నాయకులు దుర్గం శేఖర్, ఆయ వార్డుల కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు



నవతెలంగాణ- జన్నారం

మండలంలోని రాంపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఓరగంటి ఉషా ఇల్లు గోడ కూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత రాత్రి నుండి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఇంటి గోడలు కూలి రేకులు నేలకు ఒరిగిపోయి పూర్తిగా ఇల్లు ధ్వంసం అయిందని ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఇంట్లో ఉన్న టీవీ ఫ్రిజ్, కూలరు ఇతర నిత్యావసర సరుకులు దుస్తులు మొత్తం తడిచిపోయాయని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఓరగంటి ఉషా కుటుంబ సభ్యులు కోరారు.

ఉప్పొంగిన జన్నారం వాగు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. మోర్రిగూడ మహ్మదాబాద్, కలమడుగు వాగులు కూడా మోస్తారుగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వనజారెడ్డి కోరారు. వాగులలోకి, గోదావరిలోకి చేపలకు, పశువులు మేపడానికి వెళ్లకూడదని హెచ్చరించారు.

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి జోనల్ స్థాయి అవార్డులు



నవతెలంగాణ- తాండూర్

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి జోనల్ స్థాయి అవార్డులు లభించాయి. వ్యవసాయ సాంకేతిక అనువర్తన పరిశోధనా సంస్థ ఏటిఏఆర్ఐ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలోని 79 కృషి విజ్ఞాన కేంద్రాలకు కోయంబత్తూర్ లోని వ్యవసాయ వర్సిటీలో ఈనెల 17 నుండి 19వ తారీకు వరకు నిర్వహించిన వార్షిక జోనల్ సమావేశాలకు కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.రాజేశ్వర్‌నాయక్ హాజరయ్యారు. 2022-23వ సంవత్సరానికి గాను, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలతో కూడిన వార్షిక నివేదికను నాలుగు రాష్ట్రాల కృషి విజ్ఞాన కేంద్రాలతో పాటుగా సమర్పించగా బెల్లంపల్లి కిసి విజ్ఞాన కేంద్రం అవార్డుకు ఎంపికైనట్టు రాజేశ్వర్‌నాయక్ తెలిపారు.దీనిలో భాగంగా జోనల్ స్థాయిలో వివిధ విభాగాలలో చేసిన ఉత్తమ ప్రదర్శనకు 4 అవార్డులను అందుకుందన్నారు.

తెలంగాణలో వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే

నవతెలంగాణ- జన్నారం



రాష్ట్రంలో వచ్చేది మళ్లీ భారత రాష్ట్ర సమితి ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. ఖానాపూర్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్ మరోసారి గెలిచి, మంత్రి పదవిలో ఉంటారని ఆశిస్తున్నామన్నారు. ప్రజలు పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సిలువ జనార్ధన్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్, జిల్లా నాయకులు భరత్ కుమార్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీపతి బుచ్చన్న, బీఆర్ఎస్ పార్టీ జన్నారం మండల యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజన్న, డాన్ శీను పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
ఆదివారం 20 ఆగస్టు 2023

ఉచిత గుండె వైద్య శిబిరానికి భారీ స్పందన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని డాక్టర్ రవీంద్రప్రసాద్, డాక్టర్ సంధ్యారాణి జెడ్పీటీసీ, ఆధ్వర్యంలో శనివారం స్థానిక రవీంద్రప్రసాద్ ఆస్పత్రిలో మేడికవర్ హాస్పిటల్ వారు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అలాగే ఈ వైద్య శిబిరానికి ఆయా గ్రామాలు పాట్నాపూర్, కంటేగావ్, లక్ష్మీపూర్, బాబెర, కౌట(బి), కనుగుట్ట, సొనాల, పిప్పల్‌ధరితో పాటు ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అలాగే గుండె, నరాలు, చేవి, ముక్కు, గొంతు, సంబంధించిన పరీక్షలు స్కానింగ్ చేయడం జరిగిందన్నారు. ఆయా రోగులకు మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సంజయ్ కుమార్, శ్రీలత ఇందురి, అలోక్ పాల్గొన్నారు.



ఘనంగా రఘునందన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందనరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం దివ్య గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు రఘునందన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటుతో అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. అటు జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో అభిమానులు, నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.



వర్షంలో తడుస్తూ ఒంటి కాలిపై నిలబడి నిరసన



నవతెలంగాణ-నిర్మల్

తమను రెగ్యులర్ చేయడంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో ఈ మేరకు ఏఎన్ఎంలు వర్షంలో తడుస్తూ ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 13 రోజులగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జానా, నస్రత్, శోభారాణి, కౌసల్య, జమున, విజయ, రెండో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- రెండు కిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-ఇచ్చోడ

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని శనివారం ఇచ్చోడ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. నిషేదిత రెండు కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం నిందితుడు మోటార్ సైకల్‌పై నిర్మల్ వైపు తీసుకువెళ న్నాడు అని పక్క సమాచారం మేరకు వెంటనే పోలీసు సిబ్బందితో కలిసి ఇచ్చోడ మండలంలోని సాత్‌నంబర్ బస్ స్టాప్ వద్ద టకూర్ ప్రతాప్ సింగ్‌ను రెండు కేజీల గంజాయిని, మోటార్ సైకల్‌తో సహ పట్టుకోవడం జరిగింది. విచారణలో మహారాష్ట్రాకు చెందిన దన్ను అనే వ్యక్తి వద్ద రూ.15వేలకు కిలో చొప్పున 2 కేజీలు కొనుగోలు చేసి ఆర్టీసీ బస్‌లో సిరికొండకు తీసుకువచ్చి తన కొట్టంలో దాచి ఉంచాడు. శనివారం నిర్మల్‌లో అవసరం ఉన్నవారికి ఎక్కువ ధరకు అమ్మి సులభంగా డబ్బు సంపాదించాలని ఉద్యేశంతో వెళ్తుండగా వెంబడించి, రెండు కేజీల గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. తన మోటార్ సైకల్ జప్తు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు, నిందితుడు అలువాటు పడిన నేరస్థుడు గత సంవత్సరం సిరికొండ పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చాడు.

ఇంజనీరింగ్ కోర్సులపై అవగాహన

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో పీయూసీ రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం ఇంజనీరింగ్ కోర్సులపై అవగాహన సదస్సును ప్రారంభించారు. ఏఐసీటీఈ ఆదేశాల మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల కోసం 2 వారాల పరిచయ కార్యక్రమాన్ని వచ్చే నెల సెప్టెంబర్ 2 వరకు కొనసాగించనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీలో ఏడు ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయని, విద్యార్థుల ఆయా విభాగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను తెలుసుకోవడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు. వివిధ రంగాలలోని సాంకేతిక శాస్త్ర నిపుణులు విద్యార్థులకు ఇంజనీరింగ్‌లోని ఏడు విభాగాలలోని వివిధ అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ ఇంజినీరింగ్, హ్యుమానిటీస్ అసోసియేట్ డీన్, సైన్సెస్ అసోసియేట్ డీన్, ఏడు ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల ఇండక్షన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్లికేషన్ లేని అవార్డులు ఇవ్వాలి

నవతెలంగాణ-కడెం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇచ్చే తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డును అప్లికేషన్ లేని విధానంలో ఇవ్వాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాజేష్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయం వద్ద శనివారం మాట్లాడుతూ అవార్డులకు అప్లికేషన్లు అవసరం లేదని మండల విద్యాశాఖ అధికారులే అంతర్గతంగా విచారణ జరిపి ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా అవార్డులు ఇచ్చి సన్మానించి పదివేల నగదు పారితోషికం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెహ్రూ నాయక్, భూక్యా రాము, జరుపుల రాజేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల అలాగే జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక బోధన సిబ్బంది నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎం ఉమేష్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 6 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ టీజీటీ బోధించుటకు, 9వ అలాగే 10వ తరగతి వరకు హిందీ టీజీటీ బోధించుటకు అలాగే ఇంటర్మీడియట్ స్థాయిలో జువాలజీ పీజీటీ ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు తెలిపారు. దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేదీ ఈనెల 22 వరకు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాయిదా పడ్డ సమావేశం

నవతెలంగాణ-తాంసి

మండల సర్వసభ సమావేశం శనివారం జరుగాల్సి ఉండగా సమావేశాన్ని కోరం లేకపోవడంతో ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరుగాల్సిన సమావేశం వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహణ తేదీని ఖరారు చేస్తామని తెలిపారు.

నాలుగో రోజుకు చేరిన మహేశ్వర్‌రెడ్డి నిరవధిక దీక్ష

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు కొరకు బీజేపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శనివారం నాల్గో రోజుకు చేరుకుంది. ఆరోగ్యం క్షీణించడంతో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితి విషమిస్తుందని వైద్యులు తెలిపారు. ఆరోగ్య పరిస్థితి పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆందోళనలను చేపట్టారు. రహదారుల వెంట రాస్తారోకో నిర్వహించడానికి ప్రయత్నాలు చేశారు. కాగా పోలీసులు వారిని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా బీజేపీ నాయకులు వివేక్ వెంకటస్వామి, మహేశ్వర్‌రెడ్డిని పరామర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్తికాని వంతెన.. ఇబ్బందుల్లో వాహనదారులు

- 25గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని ప్రధాన గ్రామాలకు వెళ్లే రహదారిపై వాగు ఉన్నందున దానిపై రెండు దశాబ్దాల కిందటే కల్వర్టు నిర్మించారు. కానీ అవి శిథిలావస్థకు చేరుకుని గత ఏడాది భారీ వర్షాలకు కల్వర్టు కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఇటీవల నూతనంగా కల్వర్ట్ ప్రాంతాల్లో నూతన వంతెన నిర్మాణం ప్రారంభించారు. వర్షా కాలంలోపే వంతెన పూర్తి కావాల్సి ఉండగా ఇంకా నత్తనడకన కొనసాగుతున్న పనుల వల్ల తాత్కాలిక పైపులు వేసి రోడ్డు వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అది కొట్టుపోయి బురద మాయం కావడంతో, సిరిచెల్మ వైపు వెళ్లే గ్రామాలు ముప్పై వరకు ఉంటాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు, బాటసారులు, అయ్యప్పస్వామి ఆలయం వద్దకు వెళ్లే భక్తులు బురదలో నడవలేక నరకయాతన పడాల్సివస్తుంది. శనివారం సిరిచెల్మ వైపు నుంచి ద్వీచక్ర వాహనంపై రెండు నెలల పాపకు ఆరోగ్యం బాగాలేదని మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకవస్తున్న సందర్భంగా వంతెన వద్ద బురదలో ద్వీచక్ర వాహనం వెల్లకపోవడంతో మహిళ రెండు నెలల బాబును ఎత్తుకొని సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి నడుచుకుంటూ తీసుకెళ్లిన దృశ్యం అందరిని కలిచివేసింది. ఈ విషయం తెలుసుకున్న జమిడి సర్పంచ్ హారన్ సుభాష్ పటేల్, జల్ద గ్రామ సర్పంచ్ జ్యోతి నంద కిషోర్, స్థానిక వ్యాపారస్తులు కలిసి బురద మయంగా మారిన తాత్కాలిక రోడ్డుకు మొరం వేసి రాక పోకలకు సజావుగా సాగె విధంగా చేశారు. వారిని గ్రామస్తులు, వాహనదారులు అభినందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వంతెన నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

వరదకు కొట్టుకుపోయిన యువకుడిని రక్షించిన స్థానికులు...

భారీ వర్షానికి వాగులు ఉప్పొంగాయి. శనివారం కురిసిన వర్షానికి వరద రావడంతో ఓ యువకుడు కొట్టుకు పోవడంతో స్థానికులు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన ఉన్నటువంటి తాత్కాలిక బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న ఓ యువకుడు ఒక్కసారిగా వరద ప్రవాహానికి అదుపు తప్పి వాగులో పడి పోయాడు. అయితే వరద ఉధృతికి ఆ యువకుడు కల్వర్టు పైపు నుంచి బయటకు కొట్టుకపోవడాన్ని గమనించిన స్థానికులు రక్షించినట్టు తెలిపారు. వర్షం పడినప్పుడల్లా తాత్కాలిక బ్రిడ్జి కొట్టుకపోయి ప్రమాదకరంగా మారుతుంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇచ్చోడ మండల కేంద్రానికి రాకపోకలు నిర్వహించే 25 పైగా గ్రామాల ప్రజలు తాత్కాలిక బ్రిడ్జి వల్ల ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సన్నద్ధతపై సెక్టర్ పోలీస్ అధికారులకు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో కలిసి కలెక్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను ప్రశాంత వాతావరణంలో జరిగేలా సెక్టర్, పోలీస్ అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో మౌళిక సదుపాయాలను కల్పించాలన్నారు. గత సాధారణ ఎన్నికల సమయంలో శాంతిభద్రత సమస్యలు వచ్చిన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని సూచించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలలో పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాపింగ్ సిద్ధం చేసి ఆయా రూట్లకు అనుగుణంగా వాహనాలను ఎంపిక చేసుకోవాలని అన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్, ఇతర మౌళిక వసతులను పరిశీలించి, అవసరమైన వసతుల కల్పనకు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి...

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ గత ఎన్నికల నిర్వహణ, స్థానిక పరిస్థితులను విచారించి క్లిష్టమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అన్నారు. పోలింగ్ శాతం తగ్గడానికి గల కారణాలను తెలుసుకొని, ప్రజలకు అవగాహన కల్పించాలని, సంబంధిత అధికారులకు నివేదికలు సమర్పించాలని అన్నారు. సెక్టర్, పోలీస్ అధికారులు నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీఓ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా, డీఎస్పీ శ్రీనివాస్, సెక్టర్, సెక్టర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ లోగోను శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. తెలంగాణ డాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలను ఆదిలాబాద్‌లో దిగ్విజయంగా నిర్వహించామని, భవిష్యత్తులోనూ క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తూ వారికి అండగా నిలబడతామని అన్నారు. మొదటి సారిగా జిల్లాస్థాయి పోటీలను నిర్వహించడంతో పాటు వర్క్ షాప్‌ను ఏర్పాటు చేయగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ లోగోను లాంచనంగా ఆవిష్కరించారు. అంతకుముందు పలువురు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహ్వానితులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లాలో పోటీలను నిర్వహించడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. గతంలో కబడ్డీ తదితర క్రీడల జాతీయ, అంతర్జాతీయ పోటీలను నిర్వహించిన విషయాన్నీ గుర్తు చేసిన ఆయన డాన్స్ స్పోర్ట్ పోటీల నిర్వహణకు సైతం అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువత ఆసక్తి కలిగిన రంగంలో రాణిస్తూ నైపుణ్యాలను ఎప్పటికపుడు మెరుగు పరుచుకోవాలని అన్నారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ డాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, జిల్లా చైర్మెన్ మెరుగు మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కర్నేవార్ భీమేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పట్టణ అధ్యక్షులు అజయ్, డాన్సర్ సత్య పాల్గొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

- డీసీఓ లోక శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

లోకమాన్య పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం నిర్మల్ నూతన కార్యాలయాన్ని శనివారం నిర్మల్ జిల్లా సహకార అధికారి లోక శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో సహకార సంఘాలు చాలా వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పరస్పరం సహకారం చేసుకోవడం వల్లనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. సహకార సంఘాల ద్వారా అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టడానికి వీలవుతుందని సూచించారు. సభ్యుల అభివృద్ధితో పాటు పేద ప్రజల అభ్యున్నతికి కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సభ్యులను కోరారు. నిర్మల్‌లో నూతన సహకార పొదుపు సంఘాన్ని ప్రారంభించి సభ్యులను అభినందించారు. అనంతరం సహకార సంఘ వ్యవస్థాపకులు భూసారపు గంగాధర్, సభ్యులు డీసీఓని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ టాక్స్ కన్సల్టెంట్ నూకల విజయ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త నార్లపురం రవీందర్, విజయ హై స్కూల్ కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, సోలాపూర్ రాజేశ్వర్, ఆడెపు సుధాకర్, మైసర్ల శంకర్, అడాక్ కమిటీ సభ్యులు వట్టిమల్ల ప్రభాకర్, గన్నేరి ప్రభు, మాజన్ సతీష్, వసంత్ పటేల్, రాకేష్ పటేల్, సభ్యులు గంగిశెట్టి ప్రవీణ్, కూనచరణ్, భూసారపు లక్ష్మి, మంచిర్యాల వినీత, గోవింద్‌రావ్, నాంపల్లి గణేష్, మైసర్ల వెంకట రమణ, పురుషోత్తంరెడ్డి, పబ్బోజీ శ్రీనివాస్, అల్లం దేవిదాస్ పాల్గొన్నారు.



మధురమైన ఘట్టాలు...ఫొటోలతోనే సాధ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాలు, మధురమైన ఘట్టాలను చిరకాలం చూసుకునే సౌలభ్యం ఫొటోల ద్వారా మాత్రమే సాధ్యమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్ లో జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటి ఫోటో సృష్టికర్త లూయిస్-జాక్వెస్-మాండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు ఫోటోగ్రాఫర్‌లకు ప్రశంస పత్రాలు, బహుమతులు అందించి వారి పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా కెమెరాను చేతపట్టుకుని పలు ఫోటోలు తీసి అక్కడున్న వారిని ఉత్సాహపరిచారు. ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ఫోటోగ్రాఫర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేద ధనిక తేడా లేకుండా ఎదుటివారి ముఖంలో చిరునవ్వు చూడగల ఏకైక వ్యక్తులు ఫోటోగ్రాఫర్లని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఏండ్ల నాటి జ్ఞాపకాలను ఫోటోలు పదిలంగా ఉంచుతాయని అన్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడిపిన మధుర క్షణాలు సంవత్సరాల కాలం గడిచినా ఫోటోల ద్వారా వాటిని తిరిగి గుర్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్ల భవన నిర్మాణానికి తన వంతుగా పూర్తి కృషి చేస్తానని, అతి త్వరలోనే స్థలాన్ని గుర్తించి భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు మెట్టు ప్రహ్లాద్, అసోసియేషన్ అధ్యక్షులు దోడ అశోక్, మురళీధర్ అహుజా, అనిల్ కుమార్, ప్రవీణ్, హరికృష్ణ, సంతోష్ విశాల్ పాల్గొన్నారు.

దళితబంధు అందజేయాలని మహిళల నిరసన



నవతెలంగాణ-బాసర

దళితబంధు, రుణాలు అందించాలని మహిళలు శనివారం నిరసన తెలిపారు. మండలంలోని కౌట గ్రామాన్ని ఎమ్మెల్యే దత్తత తీసుకున్నారు. తమ గ్రామం దత్తత గ్రామం కావడంతో గ్రామంలోని అర్హులందరికి దళితబంధు అందజేయాలని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు మహిళలు తెలిపారు. కొందరికి ఇచ్చి మరి కొందరికి మోసం చేస్తే ఊరుకునేది లేదని ప్రతి ఒక్కరికి దళితబంధు పథకాన్ని అమలు చేయాలని అన్నారు.

శ్రావణమాసం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శ్రావణమాసం సందర్భంగా పెండ్లిలకు, శుభకార్యాలకు ఆదిలాబాద్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను అందిస్తున్నట్టు డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుభకార్యాలకు వెళ్లేవారు ఒకేచోట 30 మంది ప్రయాణికులు ఉన్నట్లయితే వారి వద్దకే ఆ బస్సు పంపే సౌకర్యం ఉందని తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ డిపో మేనేజర్ 7382800975, స్టేషన్ మేనేజర్ 7382841715 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-బాసర

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన మహిళ లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చేతుల మీదుగా 18 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ప్రభుత్వం దశలవారీగా హామీలను అమలు చేస్తుందని, బీసీబంధు, దళితబంధు, రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కోమల్‌రెడ్డి, బాసర తహసీల్దార్ పవనచంద్ర, టాక్లి గ్రామ సర్పంచ్ శోబతాయి సాయినాథ్ పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లు

నవతెలంగాణ-సిరికొండ

మేత మేయడానికి వెళ్లి వాగులో రెండు ఎడ్లు కొట్టుకుపోయిన ఘటన శనివారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మంగ ఆశన్న రైతుకు చెందిన రెండు ఎడ్లు మేత మేయడానికి వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో వాగు దాటుతుండగా, నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో కొట్టుకుపోయాయి. కురిసిన వర్షం వల్ల ప్రవాహం పెరగడంతో రైతు తన రెండు ఎడ్లను తీసుకొని, ఇంకో పది నిమిషాలు అయితే ఇంటికి చేరుకొనే క్రమంలోనే తన రెండు ఎడ్లు కొట్టుకుపోయాయని, దాదాపుగా రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు మంగ ఆశన్న కోరారు.

జగదాంబదేవి ఆలయంలో చోరీ

నవతెలంగాణ-పెంబి

మండలంలోని పెంబి లోతోర్య తండాలోని జగదాంబదేవి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి ఏవరు లేని సమయం చూసి అమ్మవారి నగలను దొంగలు ఎత్తుకెళ్లారని గ్రామస్తులు పేర్కొన్నారు. అమ్మవారి అలంకరణలో ఉన్న నగలు, బంగారు ముక్కుపుడక, సంపెర్లు, రెండు జతల కడియాలు దుండగులు దొంగిలించారని తెలిపారు.

జిల్లాలో మరో రెండు నూతన మండలాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో మరో రెండు నూతన మండలాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీఓ విడుదల చేసింది. సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. నూతన మండలాల ఏర్పాటుతో ఆ ప్రాంతపు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 28 గ్రామాలతో భోరజ్ మండలం, 18 గ్రామాలతో సాత్నాల మండలం ఏర్పాటు కాగా, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే జోగురామన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన మండలాల ఏర్పాటు పట్ల ఎమ్మెల్యే జోగు రామన్న సైతం హర్షం వ్యక్తం చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం నూతన మండలాలను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్(జి) మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తోకల గంగవ్వ (50) మహిళ కూతురు పెండ్లికి, ఇల్లు నిర్మించుకోవడానికి ప్రయివేట్ ఫైనాన్స్‌లో లోన్ తీసుకుంది. అప్పు భారం ఎక్కువైందని, బాకీ మొత్తం తీరుస్తానో లేదో అని పక్కింటి వారితో, ఆమె పిల్లలతో చెప్పుకునేదని స్థానికులు తెలిపారు. అప్పు తీర్చలేక నిరాశ చెందిన ఆమె శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు వారి ఇంటి తలుపులు తట్టగా ఎంతసేపటికి తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూస్తే ఆమె ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని వేలాడుతుంది. ఆమె కొడుకు విలాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై రవీందర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-సారంగాపూర్

వ్యక్తి అదృశ్యమైన ఘటన సారంగాపూర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలో జాం గ్రామానికి చెందిన షేక్ సోయాబ్(22) ఈ నెల 15న అత్తగారింటికి వెళ్లి వస్తానని, ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తల్లిదండ్రులు అత్తవారింటికి ఫోన్ చేస్తే ఇక్కడికి రాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తండ్రి జ్ఞాపకార్థం స్కూల్ బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బీబ్రా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తండ్రి కీర్తి శేషులు పంజ్యాల మొండయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పంజ్యాల నివాస్‌గౌడ్, బుల్లెట్‌గౌడ్ శనివారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి చేతులమీదుగా స్కూల్ బ్యాగులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బండ కృష్ణమూర్తి మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం, జయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జయేందర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి



బదిలీపై వెళ్తున్న జీఎం మోహన్‌రెడ్డిని జీఎం కార్యాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. శనివారం మందమర్రి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి మందమర్రి ఏరియా నుంచి జీఎం(సీఎం)గా కార్పొరేట్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఏరియాలోని గనుల డిపార్ట్‌మెంట్ల ఉన్నత అధికారులు ఘనంగా సన్మానించారు. అధికారులు మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జీఎం మోహన్‌రెడ్డి మందమర్రి ఏరియాకు చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలో జూన్ నెలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హాస్పిటల్ ఉద్యోగులు విజయ, మానసలకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి శనివారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ డీవై, సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు నస్పూర్, ఆర్కే-8 డిస్పెన్సరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతినెల బహుమతులు అందజేయడం అభినందించదగిన విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని అన్నారు. ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులే వారి నైపుణ్యాన్ని బయటికి తీసుకొస్తాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీవై.సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ వేదవ్యాస్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల రంగంపల్లి గ్రామానికి చెందిన గొర్రె పోషయ్య(47) అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు దండేపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోషయ్య గత కొన్ని రోజులుగా ముఖం మీద కురుపులు కావడంతో తీవ్ర ఇబ్బందికి గురికాగా కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురైన పోశయ్య శనివారం ఉదయం ఇంటి సమీపంలోని పెరడు వద్ద గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు వారు తెలిపారు. ఈ మేరకు మృతుని భార్య గొర్రె పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బురుగుడా గ్రామంలో శనివారం వీధి కుక్కల దాడిలో దాఫీ మల్లమ్మ అనే వృద్ధురాలికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఆమె వారి ఇంటి ముందు కూర్చొని ఉండగా వీధి కుక్కలు ఒక్కసారి ఆమెపై దాడి చేశాయి. వృద్ధురాలు అరుస్తుండటంతో వెంటనే కుటుంబసభ్యులు వచ్చి వాటిని కొట్టి తరిమేశారు. కుక్కల దాడిలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకవచ్చి చికిత్స చేయించారు. గతంలో కూడా గ్రామంలో పలువురిపై దాడి చేశాయని గ్రామస్థులు తెలిపారు. వీధి కుక్కలను పంచాయతీ అధికారులు స్పందించి బంధించాలని కోరుతున్నారు.

కాసిపేటలో ముగిసిన కాంగ్రెస్ పాదయాత్ర



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో వారం రోజులుగా 50 గ్రామాలల్లో 50 కిలోమీటర్ల మేర పాదయాత్రను పూర్తి చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు, సర్పంచ్ వేముల కృష్ణ పేర్కొన్నారు. శనివారం కాసిపేట మండలం ముగింపు పాదయాత్రను పెద్దనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్న తరుణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సామాన్యులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఏ గ్రామాల్లో చూసిన వితంతులకు పింఛన్‌రాక, ఉన్న భూములను ధరణి పేరిట దొరలు దోచుకున్నారని ఆరోపించారు. నూతనంగా వివాహం చేసుకొని ఏండ్లు గడుస్తున్న రేషన్ కార్డు లేక ప్రభుత్వం వచ్చే పథకాలకు దూరం అవుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాము అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రోడ్డ శారద, నాతరి స్వామి, ఎంపీటీసీ పార్వతి మల్లేష్, రాష్ట్ర ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు బాకం మల్లేష్, జయరాం, మాజి సర్పంచ్ జాడి శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, మైనారిటీ సెల్ షాకీర్, సీనియర్ నాయకులు గౌస్, మైదం రమేష్, జాడి శివ, మహాకాళి, చారి, వార్డు సభ్యులు కొత్త రమేష్, పంబాల తిరుపతి, బన్న హిందుమతి, కంచర్ల పద్మ, నాయకులు జంపన్న, శ్రీనివాస్, శ్రీధర్, మహేష్ పాల్గొన్నారు.

ఆదివాసులకు గిరిజనబంధు అమలు చేయాలి

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే ఆదివాసీ గిరిజన బంధు అమలుచేయాలని రాష్ట్ర కార్యదర్శి మెర్పెల్లి సదాశివ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసులు అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నారని, విద్య, ఉద్యోగపరంగా సైతం ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడుతున్న ఆదివాసులకు సీఎం కేసీఆర్ ఆదివాసీ గిరిజన బంధును అమలుచేయాలన్నారు. ఆదివాసులపై జాలీ ఎందుకు కలుగుతలేదని, కేవలం పోడు భూములకు పట్టాలిస్తే సరిపోదని, ఎస్‌సీ, బీసీ, మైనార్టీల కన్నా ఆదివాసులు ధనవంతులు కారని, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు అమలుచేసినప్పుడు ఆదివాసులకు ఆదివాసీ బంధు ఎందుకు అమలుచేయడంలేదని ఆయన ప్రశ్నించారు. ఆదివాసులకు రిజర్వేషన్ పరంగా కూడా ఉద్యోగాలు రావడంలేదని, ఐటీడీఏలో ఆదివాసులకు చెందాల్సినవి లంబాడీలకే అన్నీ చెందుతున్నాయని, ఆదివాసులకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందని ఆరోపించారు. ఎన్నికలు వస్తే ఆదివాసులు అందరికి గుర్తుకువస్తారని, ఎన్నికలైన తర్వాత ఆదివాసులు ఎవరికి గుర్తుకురారని, అన్ని రంగాల్లో ఆదివాసులు ముందుండేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

వేతనాలు రాక..వెతలు తీరక..!

- పస్తుల్లో మిషన్ భగీరథ కార్మికులు
- నాలుగు నెలలుగా అందని జీతాలు
- పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వంటి సౌకర్యాలు కరువు
- శ్రమదోపిడీకి గురవుతున్న నిరుపేద కార్మికులు

ప్రజల దాహార్తి తీర్చేందుకు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పస్తులుండాల్సిన దుస్థితి వచ్చింది. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. అరకొర వేతనాలతో రాత్రింబవళ్లు పనిచేస్తున్నా వేతనాలు సక్రమంగా రాకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. వీటితో పాటు వారికి దక్కాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా వంటి సౌకర్యాలను నోచుకోలేకపోతున్నారు. పనిగంటలంటూ లేకుండా పండగ రోజుల్లోనూ పనిచేయాల్సి వస్తోంది. ఏజెన్సీలు, ప్రభుత్వం కార్మికులను శ్రమదోపిడికి గురిచేస్తున్నాయి. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజుల క్రితం ఎల్అండ్‌టీ యాజమాన్యానికి విన్నవించారు. నాలుగు రోజులుగా విధులకు గైర్హాజరు కావడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.



నవతెలంగాణ-కెరమెరి

ఇంటింటికీ రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలలు, రైతు వేదికలు, శ్మశానవాటికలకు కూడా మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేస్తున్నారు. నీటి శుద్ధి కేంద్రాల నుంచి పైప్‌లైన్ల ద్వారా ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులకు, అక్కడి నుంచి నల్లాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి శుద్ధి అయినప్పటి నుంచి నల్లాలకు సరఫరా అయ్యే వరకు కార్మికులదే కష్టం. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కార్మికులు వివిధ ఏజెన్సీల ద్వారా నియమించబడి పనిచేస్తున్నారు. కనీస వేతనాలకు నోచని భగీరథ కార్మికులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ విభాగంలో సూపర్ వైజర్లు, పంపు ఆపరేటర్లు, వాల్ ఆపరేటర్లు, ఎలక్ట్రిసిటీ, లైన్‌మెన్లు, పంపు ఆపరేటర్లు, ఫిట్టర్లు, వాల్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, వాచ్‌మెన్లుగా 600 లకు పైగా పనిచేస్తున్నారు. వీరంతా 2015 నుంచే ఎల్ అండ్ టి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు. నెల రోజుల పాటు పనిచేస్తే రూ.10,000 నుంచి రూ.12000 వరకు జీతాలిస్తున్నారు. కార్మికుల శ్రమ ఫలితంగా మిషన్ భగీరథ పథకానికి దేశ స్థాయిలో గుర్తింపు వచ్చింది. స్వయంగా సీఎం కేసీఆర్ పర్యవేక్షిస్తున్న ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు కావడంలేదు. పండగ రోజు కూడా పనిలోకి రాకపోతే జీతంలో కోత పెడుతున్నారు. రాత్రింబవళ్లు నీటి సరఫరా కోసం కష్టపడి పనిచేస్తున్న క్రమంలో కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కార్మికులు కోరుతున్నా ఏజెన్సీలు పట్టించుకోవడంలేదు. బోనస్, పండగ సెలవులు వర్తించడంలేదు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కొన్ని ఏజెన్సీలు కల్పిస్తుండగా కొన్ని పట్టించుకోవడంలేదు.

జీతాల్లేక పస్తుల్లో భగీరథ కార్మికులు

మిషన్ భగీరథ స్కీంలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు, కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రావడంలేదు. దీంతో విధుల్లోకి వెళ్లడానికి నెల వారి అలవెన్సు రూ. 2500 నుండి రూ.3వేల వరకు అవుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ఫీజులు,ఆసుపత్రి ఖర్చులు,రోజు వారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తుందని కార్మికులు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.నాలుగు నెలలకోసారి ఒక నెల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో అప్పులు తీర్చడానికే సరిపోవడం లేదని,కుటుంబ పోషణ భారంగా మారడంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నామని కార్మికులు వాపోతున్నారు.ఏజెన్సీలకు ప్రభుత్వం వేతనాల బిల్లులు నెలనెలా విడుదల చేస్తున్నప్పటికీ వాటిని ఉద్యోగులకు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. అవి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఏప్రిల్,మే, జూన్, జులై మాసాల వేతనాలు చెల్లించడంలో తాత్సారం చేస్తున్నాయి. వేతనాలు సక్రమంగా చెల్లిస్తేనే విధుల్లో చేరుతామని మిషన్ భగీరథ కార్మికులు పేర్కొంటున్నారు.

మిషన్ భగీరథ కార్మికుల డిమాండ్లు

జీవో నెంబర్ 60 ప్రకారం రూ.26 వేల రూపాయలు చెల్లించాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా అందించాలని కోరుతున్నారు. వారాంతపు సెలవులను మంజూరు చేయాలని, వాల్ ఆపరేటర్లకు ట్రావెలింగ్ అలవెన్సును ఫోన్ బిల్లులను చెల్లించాలని, మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులను ఇవ్వాలని, రాత్రిపూట పని చేసే పంప్ ఆపరేటర్లకు సేఫ్టీ పిపి కిట్స్, టార్చ్ లైట్లు అందజేయడంతో పాటు ప్రతి కార్మికునికి ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

జిఓ నెం 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

భీమరాజు, నెహ్రూనగర్ మిషన్ భగీరథ కార్మికుడు



గత కొన్నేళ్లుగా మిషన్ భగీరథలో పని చేస్తున్నాం.మా శ్రమకు తగ్గ వేతనాలు అందడం లేదు. పస్తులుండి విధులకు హాజరై ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కృషి చేస్తున్నప్పటికీ మా కష్టానికి ఫలితం లేకుండా పోతుంది. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇచ్చే అరకొర వేతనాలైన ప్రతి నెల చెల్లిస్తే కుటుంబ పోషణ భారం కాస్త తగ్గుతుంది.జీవో నెం.60 వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం

కూకటి ఆనంద్‌రావు, సీఐటీయూ మండల కన్వీనర్



రాష్ట్రంలో మిషన్ భగీరథ స్కీంలో ఏజెన్సీల జోక్యం లేకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. కార్మికులు, ఉద్యోగులకు ప్రభుత్వమే జీతాలివ్వాలి. కనీస వేతన జీవో ప్రకారం రూ.26 వేలు చెల్లించాలి. ఇతర చట్టబద్ధమైన సదుపాయాలు కల్పించాలి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే కార్మికులు అనేక కష్టాలు పడుతున్నారు. రాత్రిపూట పనిచేస్తున్న వారికి కనీసం టార్చ్ కూడా ఇవ్వట్లేదు. గుర్తింపు కార్డుల్లేవు. ఏన్నో ఏండ్లుగా పనిచేస్తున్నా వేతనాలు పెంచడం లేదు.. నెల నెలా వేతన బిల్లులు వస్తున్నా ఏజెన్సీలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాయి. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో వారి పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 2నుంచి సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే సెప్టెంబర్ 2 నుంచి సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం లింగయ్య అధ్యక్షతన కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల వేతనాలను సక్రమంగా ఇవ్వకుండా నెలలు తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని అన్నారు. కార్మికులకు సంబంధించిన జీఓలు అమలు చేయకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ఎల్ అండ్ టి, ఎవరెస్ట్, మెగా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 11 అమలు చేస్తున్నామని చెప్పి అందరు కార్మికులకు అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లించడమేంటని ప్రశ్నించారు. అనేక సంవత్సరాలు నుంచి పనిచేస్తున్న వారికి సెమీ, హై స్కిల్ వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ అవేవీ వర్తింప చేయడం లేదన్నారు. కార్మికులకు బోనస్, ప్రయాణ ఖర్చులు, ఫోన్ బిల్లుల కోసం రూ.5000 అదనంగా ఇవ్వడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26000 చెల్లించాలన్నారు. రూ.50 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేసినట్లు వివరించారు. ప్రభుత్వం కంపెనీలు స్పందించకుంటే సెప్టెంబర్ 2 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఓదెలు, కార్యదర్శి రాజేందర్, నాయకులు బుడ్డయ్య, ఈశ్వర్, లింగయ్య, శంకర్, పాండు, గోకుల్, రాజు, ప్రకాష్, హరీష్, మునిశ్వర్, సంతోష్, పవర్ రాజు, భీమ్రాజ్, శ్రీకాంత్, బాలేష్, విజయ్, ఇంద్రవెల్లి, సాయినాథ్, శీను, శుభం, మధుకర్, దేవేందర్, అంబాజీరావు, ప్రభాకర్, గోపి, విక్రం పాల్గొన్నారు.

చాలని జీతాలతో పస్తులుంటున్నాం

లింగయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు



చాలీచాలని జీతాలతో పస్తులుండి పనిచేస్తున్నాం. 2015 నుంచి పనిచేస్తున్నప్పటికీ రూ.10 నుండి 12వేలకు మించి జీతం రావట్లేదు. మార్చి నుంచి జీతం లేక కుటుంబ పోషణ గడవడమే కష్టమైంది. ధరలు పెరుగుతున్నాయి. కానీ.. మా జీతాలు పెరగట్లేదు. ప్రమాదాలకు గురవుతున్నా బీమా సదుపాయం లేదు. పీఎఫ్, ఈఎస్ఐ లేదు. పండగ రోజు పనిచేయకపోతే ఆ రోజు జీతం కోతపెడుతున్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. వేతనాలు సక్రమంగా చెల్లించని పక్షంలో విధులకు హాజరయ్యేదిలేదు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు గుర్తింపు ఏదీ..?

- నూతన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి
- జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ



నవతెలంగాణ-హాజీపూర్

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎం లకు గుర్తింపు ఏదని కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సంఘం నాయకులు ప్రశ్నించారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో సమ్మె 4వ రోజు శనివారం నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఐబీ చౌరస్తా నుంచి వెంకటేశ్వర థియేటర్ మీదుగా మున్సిపాల్ ఆఫీస్ గుండా ఐబీ చౌరస్తా వరకు నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను గత 20 ఏళ్లుగా వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. కనీస వేతనం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే చేసే ఆందోళన పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్, యూనియన్ అధ్యక్షురాలు పద్మ, కవిత, ప్రవీణ, స్రవంతి, శైలజ, రాధా, రాజకుమారి, విజయలక్ష్మి, దివ్య, మాధవి పాల్గొన్నారు.

జీఓ 22ను గెజిట్ చేసి వేతనాలు పెంచాలి

నవతెలంగాణ-నస్పూర్



రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 22ను గెజిట్ చేసి వేతనాలు పెంచాలని ఎస్‌సీకేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఆర్కే-5 గనిలో పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుకై పోరుబాటలో భాగంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో నేడు దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాలలో పనిచేస్తున్నారని, ఈ కాంటాక్ట్ కార్మికులకు ఒకవైపు రోజురోజుకు పెరుగుతున్న పని భారం, మరోవైపు అధిక ధరలతో సతమతమవుతున్నారన్నారు. కార్మికుల వేతనాలు మాత్రం గొర్రెతోక బెత్తెడు లెక్క అక్కడే ఆగిపోయాయని విమర్శించారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయి అనుకున్న కాంట్రాక్టు కార్మికులకు బంగారు తెలంగాణలో మరింత బతుకులు దిగజారిపోయాయని పేర్కొన్నారు. 73 షెడ్యూల్ పరిశ్రమలలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాల జీఓలను సవరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పటివరకు జీఓలను సవరించలేదని మండిపడ్డారు. కార్మికులు చేసిన అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 5 జీఓలను 2021 జూన్‌లో విడుదల చేసిందని, నాటి నుంచి నేటి వకరు ఏండ్లు గడుస్తున్నా ఆ జీవోలను గెజిట్ చేయకుండా కాలయాపన చేస్తూ వస్తుందని విమర్శించారు. ఇప్పుడు కూడా మళ్లీ పాలకులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల బాదలు పట్టించుకోకుండా, వారి వేతనాలు పెంచడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అండర్ గ్రౌండ్ కార్మికులు, క్యాంటీన్ కార్మికులు, టబ్ క్లీనింగ్ కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) తెలంగాణ రాష్ట్ర 16వ మహాసభలకు కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి పిలుపునిచ్చారు. శనివారం గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవనంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఈ మహాసభలకు జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి హాజరవుతున్నారని తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పలు తీర్మాణాలు చేస్తారన్నారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, బ్రాంచ్ కోశాధికారి శేషు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేష్, దివాకర్, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఎస్అండ్‌పీసీ ఫిట్ కార్యదర్శి మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు చల్లూరి అశోక్, సాగర్‌గౌడ్, నాయకులు అంజయ్య, ఆవుల మల్లేష్, రామ్మూర్తి, కోటి పాల్గొన్నారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'



నవతెలంగాణ-నస్పూర్

రక్తదానం చేయడం అంటే ప్రాణదానంతో సమానమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఆర్కే-8 డిస్పెన్సరీలో వృత్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం చేసిన 17 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సంస్థలో ఉద్యోగంలో చేరే ముందే సామాజిక సేవలో భాగంగా రక్తదానం చేయడం చాలా సంతోషకరమైన విషయమని, డబ్బులతో కొనలేని వాటిలో రక్తం ఒకటని, మనం రక్తదానం చేయడం చాలా అవసరమని అన్నారు. అలాగే ఈ రోజు రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు ఆపదలో ఉన్న వారికి తలసేమియా, సికిల్ సేల్ వ్యాధిగ్రస్తులకు విరివిగా రక్తాన్ని అందించడం అభినందించదగిన విషయమని తెలియచేశారు. అలాగే కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు తప్పనిసరిగా ఎటువంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని, గైర్హాజరు కాకుండా డ్యూటీలు చేయాలని, సింగరేణి సంస్థ ఉద్యోగులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఉద్యోగులు వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, డాక్టర్ వేదవ్యాస్, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎం కల్లూరి వెంకట రామారావు, వృత్తి శిక్షణ కేంద్రం శిక్షకులు రాజ్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రాఫీ దినోత్సవం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

184వ ప్రపంచ ఫోటోగ్రాఫీ దినోత్సవాన్ని పట్టణ ఫోటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఠాగూర్ స్టేడియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మొదటిసారిగా కెమెరాని ఆవిష్కరించి ప్రపంచానికి కెమెరాను పరిచయం చేసిన లూయిస్ జాక్వెస్ మండే డాగురె గుర్తు చేసుకుంటూ ఆయన నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎర్రవెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్రం ఉదయ్, కోశాధికారి గాదాసు కనకరాజు, గౌరవ అధ్యక్షుడు గోకే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చాపిడి రవీందర్, సలహాదారులు సెలెక్ట్ కుమార్, కార్యదర్శులు సిద్ధం సతీష్, బద్రి సతీష్, ప్రచార కార్యదర్శి బండి అరుణ్, సభ్యులు మస్కం స్వామి, ఎస్ నాగరాజు, పోవరి రాజు, తీగల వెంకటేష్, గిరిబాబు, సందని, మిట్టపల్లి, రమేష్, నాగేందర్, జాడీకిషన్, సాయికుమార్, శేఖర్, కిరణ్, రాజకుమార్, సాయి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com

నవ తెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

ఆదివారం 20 ఆగస్టు 2023

అడవి కుక్కల దాడిలో మరణించిన మేకలకు పోస్టుమార్టం

కోటపల్లి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఏటెల్లి సమ్మయ్య కి చెందిన 10 మేకలు ,కామ కిష్టయ్య కి చెందిన ఒక్క మేకను శుక్రవారం సాయంత్రం అడవి కుక్కలు దాడి చేయడంతో 11 మేకలు అక్కడికక్కడే మరణించాయి.దీంతో బాధితులు సమాచారం ఫారెస్ట్ అధికారులు, పశువైద్యులకు తెలపడంతో శనివారం సంఘటన స్థలానికి వచ్చి పశు వైద్య డాక్టర్ పవన్ కుమార్, ఫారెస్ట్ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ జరిగిన నష్టానికి ప్రభుత్వం నుండి నష్టపరిహారం వచ్చేలా చేస్తామని అన్నారు.



క్రమశిక్షణే విద్యార్థి ఎదుగుదలకు మూలం

జన్నారం : చిన్నతనం నుంచే క్రమశిక్షణగా ఉండి మంచిగా చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ సర్పంచ్ సునర్కార్ లక్ష్మణ్, కార్యదర్శి మహేష్ అన్నారు. శనివారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు లింగాల తిరుపతి రమ్య వివాహ దినోత్సవం, పూరెల్ల రజిత జన్మదినం సందర్భంగా బ్యాగులు, పెన్నులు, పుస్తకాలు, నోటుబుక్కులు, ప్లేట్లు గ్లాసులు, ఇతర వస్తువులను అందించారు. అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మ అంగన్వాడీ టీచర్లు, ఉప్పు నిర్మల, జాడి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

- 21న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జాఫర్



నవతెలంగాణ-కెరమెరి

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అనేక సమస్యల నెలకొన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు యునిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, గురుకులాలు, హాస్టల్స్, కెజిబివిలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం బిల్లులు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలన్నారు. తద్వారా మారుముల గ్రామాల పేద విద్యార్థులు కళాశాలకు వస్తారన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలు, కెజిబివిలు, కళాశాల వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను నిర్మించి, తొలగించిన స్కావెంజర్లను వెంట విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు రాంచందర్, తిరుపతి, సాగర్, ఎం. తిరుపతి పాల్గొన్నారు.

21న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

విద్య రంగ సమస్యలు పరిష్కరించడానికి ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 21న చలో కలెక్టరేట్ ముట్టడిని విద్యార్థులు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత మూడేళ్లుగా రూ. 5177 కోట్ల విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, పాఠశాల, కళాశాల విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, గురుకులాలకు హాస్టల్ కేజీబీవీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు తక్షణమే అందించాలన్నారు. విద్యా రంగ సమ్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలంలో విద్యార్థులు అధిక సంఖ్యంలో పాల్గొనలని కోరారు.

అంధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన మండిగా గోపాల్, సోమక్కా అంద దంపతులకు జునార్కర్ నానయ్య శనివారం నిత్యవసర సరుకులు అందజేసి ఉదారత చాటారు. వారిని చూసి చలించిపోయి ఆ కుంబానికి ఐదు కిలోల బియ్యంతో పాటు, మూడు కిలోల కంది పప్పు, బట్టలు అందించారు. అందించిన వారిలో లోడెల్లి ప్రవీణ్, జునుగారి శేఖర్, బోర్కుట్ వెంకన్నా, బోగా రాజమౌలి, మోర్కుర్ మధుకర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-రెబ్బెన

దైవం అందించిన జీవితంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. శనివారం ఖైరిగూడ ఓసీపీ ఆవరణలో దుర్గామాత 16వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఓటు జీఎంతో పాటు బెల్లంపల్లి ఏరియా ఇంజనీర్ తిరుమలరావు, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ హాజరయ్యారు. ముందుగా హోమం నిర్వహించిన అనంతరం కుంకుమపూజలో కోరం కిరణ్, బొంగు వెంకటేశం, చంద్రశేఖర్, మల్లేష్ కార్మికుల దంపతులు పాల్గొన్నారు. ఖైరిగూడ ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, మేనేజర్ ప్రవీన్ పాంటింగ్, రక్షణ అధికారి రాజేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశం, చంద్రశేఖర్, రాజేశం, భాస్కరాచారి, కార్మిక సంఘాల నాయకులు పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు



నవతెలంగాణ-జైనూర్

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండలంలోని జంగాం గ్రామానికి చెందిన బండ ప్రశాంత్ అనే యువకుడికి ఉత్తమ అవార్డు లభించింది. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన ఫోటోగ్రఫీ దినోత్సవంలో ఎమ్మెల్యే జోగురామన్న యువకుడికి ప్రథమ అవార్డును అందజేశారు. ఉమ్మడి జిల్లాలోనే ఈ అవార్డు అందుకోవడంతో మండలవాసులు ఫోటోగ్రాఫర్ ప్రశాంత్‌ను అభినందించారు.

ఎస్సైని సన్మానించిన లంబాడీ ఐక్యవేదిక నాయకులు

నవతెలంగాణ-జైనూర్

జైనూర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్ శనివారం మండలంలోని లంబాడీ ఐక్య సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులకు రక్షణ కల్పించడంలో సహకరించాలని కోరారు. గ్రామాల్లో తిరుగుతూ చట్టాలపై ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లంబాడీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ గుణవంత్, మండల అధ్యక్షుడు మోహన్, కన్వీనర్ ధర్మేందర్, ప్రేమ్‌లాల్, బలిరాం పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనది

- కలెక్టర్ బొర్కడే హేమంత్
- జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల 5కే రన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యతమైనదని, ఎన్నికల సమయంలో ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ తమ ఓటును ఎలాంటి ఒత్తిడులకు, ప్రలోభాలకు లోను కాకుండా సక్రమంగా వినియోగించుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో 'ఐ ఓట్ ఫర్ షూర్' నినాదంతో నిర్వహించిన 5కె రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు బూత్ స్థాయి అధికారులు, ఆన్లైన్‌లో ఫారం 6 ద్వారా తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల ప్రలోభాలకు, ఒత్తిడులకు లోను కాకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. దేశాన్ని పాలించే నాయకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం మనకు కల్పించిన వరమని, ఈ హక్కును సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయాలలో ఓటు హక్కు ఎంతో విలువైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పించడం జరిగిందని, వృద్ధులు, దివ్యాంగుల కొరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ట్రాన్స్ జెండర్లు తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని, ఎన్నికల సమయంలో వినియోగించుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ నుండి బస్టాండ్ మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు ర్యాలీ చేరింది. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సురేష్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి : కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నుండి ఓట్ ఫర్ షూర్ 5కే రన్ నిర్వహించారు. అధికారులతో పాటు యువకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీపీ పెందూర్ మోతీరాం ర్యాలీని ప్రారంభించగా, వర్షంలోనూ రన్ సుల్తాన్‌గూడ మీదుగా కేస్లాగూడ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ జహీర్‌ఖాన్, ఎంపీడీవో మహేందర్ మాట్లాడుతూ అక్టోబర్ 1 వరకు 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. యువకులు ఓటు హక్కుపై నిరక్షరాస్యులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన 5కే రన్‌లో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 5కే రన్‌ను నిర్వహించినట్టు తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకొని బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును కలిగి ఉండాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ లలిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం నుండి పెద్దబండ గ్రామం శివారు వరకు 5కే రన్‌ను నిర్వహించారు. నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు తమ ఓటు హక్కును నమోదుచేసుకొని ఓటును ఉపయోగించుకోవాలని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు ఉందని తెలిపారు. ప్రజల కొరకు, ప్రజల చేత ఎన్నుకొనే విధానాన్ని మన రాజ్యాంగం కల్పించిందన్నారు. దేశ భవిష్యత్ నేటి ఓటుపై ఉందని, ఎన్నికల్లో ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ దీకొండ రమేష్, ఆర్ఐ జుగాజీరావు, మోబిన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కెరమెరి :



సిర్పూర్(టి) :

వర్షంలో గొడుగులు పట్టుకొని ఏఎన్ఎంల నిరసన

- ఐదవ రోజుకు చేరుకున్న సమ్మె



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్ట్ ఏఎన్ఎం లకు ఎటువంటి రాత పరీక్షలు లేకుండా యధావిధిగా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండవ ఏఎన్ఎం లు తెలంగాణ యూనిటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. కాగా శనివారంతో ఈ సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం నుండి కొమురం భీం చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. వర్షం సైతం లెక్కచేయకుండా వర్షంలోనే గొడుగులు పట్టుకొని మహా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ.. సమ్మె చేపట్టి ఐదు రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని అన్నారు. ప్రభుత్వం డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, ఏఎన్ఎం నాయకులు పుష్పల, విజయలక్ష్మి, ఆనంద బాయి, సవిత్రా పాల్గొన్నారు.



జోరు వానలోనూ తగ్గని ఏఎన్ఎంల పోరు

ఆసిఫాబాద్ : రెండవ ఏఎన్ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 4వ రోజు జోరు వానలోనూ కొనసాగింది ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల పట్ల కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. సవతి తల్లి ప్రేమ సరైనది కాదని, మహిళా ఉద్యోగులు రోడ్లపై ఆందోళనలు చేయాల్సిన దుస్థితి పాలకులు కల్పించడం దారుణం అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి వారి సర్వీసులు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షులు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు భాగ్య, ప్రచార కార్యదర్శి భూదేవి, ప్రమీల, కోశాధికారి సునీత, నాయకులు పద్మ, సునీత, రాజేశ్వరి, తిరుమల, మంగ, లీల, కవిత పాల్గొన్నారు.

జీఎం బదిలీ నిలిపేయాలని కార్మిక జేఏసీ నిరసన



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి బదిలీని నిలిపేయాలని కార్మిక సంఘాల జేఏసి ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం టీడీపీ కార్యాలయంలో ఏఐటీయూసీ, ఐఎన్టియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, బిఎంఎస్ జాతీయ సంఘాలు మీడియా సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందమర్రి జీఎం మోహన్‌రెడ్డిని రాజకీయ ఒత్తిడితోనే నాలుగు నెలలకే బదిలీ చేయడం అన్యాయమన్నారు. 130 సంవత్సరాల సింగరేణి చరిత్రలో కేవలం నాలుగు నెలలకే జీఎంని బదిలీ చేయడాన్ని నిరసిస్తున్నామని తెలిపారు. బదిలీ ఉత్తర్వులు వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకూ సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోవడం వల్ల నీతినిజాయితీతో పనిచేసే అధికారులకు మిగిలేది బదిలీలేనా అని ప్రశ్నించారు. జీఎం బదిలీ నిలుపుదల చేసేంతవరకు తామంతా సమిష్టి పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, ఏఐటియుసి బ్రాంచ్ నాయకులు వెల్ది ప్రభాకర్, సిఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకట్ స్వామి, బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెల్ది సుదర్శన్, బిఎంఎస్ బ్రాంచ్ సెక్రటరీ ప్రదీప్, బిఎమ్ఎస్ రాష్ట్ర నాయకులు వీరన్న పాల్గొన్నారు.

కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్



నవతెలంగాణ-కాసిపేట

టీబీజీకేఎస్‌తోనే కార్మికుల హక్కుల సాధన సాధ్యమని ఆ సంఘం ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్ అన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్ నిర్వహించారు. టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు యూనియన్ల నుంచి టీబీజీకేఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి కార్మికులను కడుపున పెట్టుకున్న సంఘం ఏదైనా ఉందంటే అది టీబీజీకేఎస్ మాత్రమేనన్నారు. బదిలీ కార్మికుడిగా నియామకం అయిన 190/240 మాస్టర్లు నిండిన ప్రతి ఒక్క కార్మికుడిని జనరల్ మజ్దూరుగా రెగ్యులరైజ్ చేస్తూ వస్తుందని, ఇంతకు ముందు బదిలీ కోల్ ఫిల్లర్ నుంచి జనరల్ మజ్దూర్‌గా రెగ్యులర్ కావడానికి నాలుగేళ్లు పట్టేదని, కాని ఇప్పుడు ఏడాదికే జనరల్ మజ్దూరుగా పర్మినెంట్ చేయడం జరుగుతుందన్నారు. అనేక రకాలుగా కార్మికులకు అండగా ఉండి 3 హక్కులను సాధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, రీజినల్ సెక్రెటరీ ఓ రాజశేఖర్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌ఛార్జి పెండ్రి రాజిరెడ్డి, ఏరియా సెక్రెటరీ శంకర్‌రావు, వొడ్నాల రాజన్న, ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, బైరి శంకర్, సెగ్గం శ్రీనివాస్, రాజేందర్, గణపతి, తిరుపతి, కృష్ణ మోహన్, పిరిసింగుల రాజు, గోపాల కృష్ణ, కొత్తపల్లి ఉదయ్, గోమాస తిరుపతి, సారంగపాణి, కమల్, శరత్, గణపతి, అంజి, రవి కిరణ్ పాల్గొన్నారు.

రుణ మాఫీ అందని రైతులు సంప్రదించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన రుణమాఫీ అందని రైతులు తమ వివరాలను తమకు తెలియజేయాలని కాగజ్‌నగర్ వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. శనివారం గన్నారం, ఆరెగూడ గ్రామాల్లో ఏఓ పర్యటించి రుణమాఫీ పట్ల రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఏఓ మాట్లాడుతూ 2018లో పంట రుణం పొంది ఆ తర్వాత అనివార్య కారణాలతో బ్యాంకు ఖాతా మూతపడడం, రైతులు మరణించడం లాంటి కారణాలు ఉన్నవారికి రుణమాఫీ కాలేదన్నారు. ఇలాంటి కారణాలు ఉన్న రైతులు, కుటుంబీకులు తమ వివరాలతో ఏఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రుణమాఫీ మీద రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న ఆధార్, పట్టాపాస్ బుక్ జిరాక్స్ పత్రాలతో వ్యవసాయ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని తెలిపారు. రైతులు పీఎం కిసాన్ డబ్బుల కొరకు ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు అధిక వర్షాలు ఉన్నందున రైతులు అవసరమైతేనే పంట పొలాలకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరెగూడ సర్పంచ్ పురుషోత్తం, ఏఈఓ శైలేష్, రైతులు పాల్గొన్నారు.

5కే రన్ విజయవంతం

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, ఆసిఫాబాద్ కలెక్టర్ ఆదేశానుసారం మండలకేంద్రంలతో శనివారం ఉదయం ఆరు గంటలకు బకిలి పట్టు పరిశ్రమ నుంచి కస్తూర్బాగాంధీ విద్యాలయం వరకు ఓటు హక్కు నా జన్మహక్కు ఐదు కిలోమీటర్ల పరుగు కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, యువకులు పాల్గొని విజయవంతం చేశారు.

రెబ్బెన : ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఒక వజ్రాయుధమని ఇన్‌చార్జి తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. శనివారం గోలేటిలో దుబ్బగూడెం అంబేద్కర్ కాలనీ, భగత్‌సింగ్ నగర్, గోలేటి టౌన్‌షిప్ మీదుగా 5కే రన్ నిర్వహించారు. అనంతరం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేముర్ల సంతోష్, గోలేటి గ్రామ సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, పీఈటీ భాస్కర్, దుర్గం రవీందర్, కేసరి ఆంజనేయులుగౌడ్, పూదరి సాయి, ఏఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం



నవతెలంగాణ-జైనూర్

మండలంలోని మార్లావాయి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టిన కుమ్ర వెంకటమ్మను మార్లావాయి గ్రామస్తులు, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చారిత్రాత్మక గ్రామమైన మార్లావాయి గ్రామంలోని చిన్నారులకు మంచి విద్యనందించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రామంలోని చిన్నారులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జుగునాక సావిత్రి ధర్మేందర్, గ్రామపటేల్ ఆత్రం రాజేష్, దేవారి కనక గుణవంత్ పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

కడెం : ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కరువయ్యాయి. శనివారం పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటుచేయడంతో అక్కడి సమస్యలు వారి దృష్టికి వచ్చాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 400మంది విద్యార్థులు చదువుకుంటుండగా నిత్యం వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు లేకపోవడం, స్వీపర్లు లేకపోవడంతో విద్యార్థులే రోజూ తరగతి గదులను శుభ్రం చేస్తున్నారు. హిందీ బోధకుడు లేకపోవడంతో ఆ పుస్తకాన్ని తెరవని పరిస్థితి ఉంది. ఆయా సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులను నిలదీశారు.